సాక్షి
చిత్తూరు

మంగళవారం । 2 । సెప్టెంబర్ । 2025



న్యూస్‌రీల్

10న సంకటహర గణపతి వ్రతం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో ఈనెల 10వ తేదీన గణపతి వ్రతం జరగనున్నట్లు ఈవో పెంచల కిషోర్ తెలిపారు. ఉదయం 10 నుంచి 11గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6గంటల వరకు వ్రతం జరగుతుందన్నారు. రాత్రి 7 నుంచి 8గంటల వరకు స్వర్ణ రథోత్సవం ఉంటుందన్నారు. ఈ సేవలో పాల్గొనదలచిన భక్తులు ఆన్‌లైన్ ద్వారా ముందస్తుగా టిక్కెట్లు పొందవచ్చని ఆయన సూచించారు.

7న సత్యనారాయణవ్రతం

కాణిపాకం: పౌర్ణమిని పురస్కరించుకుని ఈనెల 7వ తేదీన కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీవరదరాజస్వామి ఆలయంలో సామూహిక శ్రీసత్యనారాయణ వ్రతం జరగనున్నట్లు ఈవో పెంచలకిషోర్ తెలిపారు. ఉదయం 9 నుంచి 11గంటల వరకు వ్రతం జరుగుతందన్నారు.

తల్లులకు ఓపీ పరీక్ష



చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఓపీ కోసం క్యూకట్టిన తల్లులు


చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ప్రసూతి విభాగంలో సోమవారం ఓపీకొచ్చిన తల్లులకు పరీక్ష పెట్టారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓపీ కోసం గర్భిణులు, బాలింతలు క్యూకట్టారు. గంటల కొద్దీ క్యూలో నిరీక్షించి నీరసించిపోయారు. ఓపీ ఇచ్చే సిబ్బంది నెమ్మదించడంతో ఈ పరిస్థితి ఎదురైంది. కనీసం వారికి కూర్చుకోవడానికి కుర్చీలు కూడా చాలినన్ని వేయలేదు. ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో ఈ పరిస్థితి ఎదరువుతోంది. ఆస్పత్రి అధికారులు స్పందించి తల్లులకు ఇబ్బంది లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

5న జెడ్పీలో గురుపూజోత్సవం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 5వ తేదీన విద్యాశాఖ, సమగ్రశిక్షా శాఖల ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు సంబంధిత ఆయా శాఖలు పకడ్బందీగా ఏర్పాట్లు చేపడుతున్నాయి. ఉత్తమ టీచర్లకు అవార్డులు అందజేసి సత్కరించనున్నట్లు డీఈవో వరలక్ష్మి, ఏపీసీ వెంకటరమణ తెలిపారు.

పేదల దేవుడు నువ్వు
అభాగ్యుల ఆరాధ్యదైవం నువ్వు
జల ప్రదాతవి నువ్వు
ఆరోగ్య రక్షకుడివి నువ్వు
చదువుల రేడువి నువ్వు
సంక్షేమ సారథివి నువ్వు
నవ సంకల్పానికి నాందివి నువ్వు
జవసత్వానికి పునాదివి నువ్వు
మమ్మేలిన 'మహా నేతవి' నువ్వు

16 ఏళ్ల నీ జ్ఞాపకాలు.. అభివృద్ధికి చెరగని సంతకాలు నిన్ను ఎలా మరిచేది రాజన్నా.. అంటూ జిల్లా ప్రజలు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సేవలను స్మరించుకుంటున్నారు.



రాజన్నలేక బోసిపోయిన చిత్తూరు అనుప్పల్లె

వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందించిన రైతుబాంధవుడు

- ఫీజురీయింబర్స్‌మెంట్‌కు శ్రీకారం చుట్టిన మహనీయుడు
- ఆరోగ్యశ్రీతో పేదలకు రక్షణ కల్పించిన ఆపద్బాంధవుడు
- జలయజ్ఞం చేపట్టిన దార్శనికుడు
- నేడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి

పదహారేళ్లు.. చెరగని జ్ఞాపకాలు

సాక్షి ప్రతినిధి, తిరుపతి : మనసున్నవాడు పాలన సాగిస్తే ఎంత జనరంజకంగా ఉంటుందో.. ప్రజలను ఓటర్లుగా కాకుండా తన వాళ్లుగా చూసే నాయకుడు గద్దెనెక్కితే రాష్ట్రం ఎంత సుభిక్షంగా ఉంటుందో దేశానికి చాటి చెప్పిన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి. తెలుగువారి గుండెల్లో సంక్షేమ సంతకం చేసి చెరగని జ్ఞాపకంగా మిగిలిపోయారు. నేడు వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఉమ్మడి జిల్లాలో ఆయన చేసిన అభివృద్ధి పనులపై ప్రత్యేక కథనం.

- నాటి ఉమ్మడి జిల్లాలోని మదనపల్లెలో మూత పడిన విజయాడెయిరీని 2008లో పునఃప్రారంభించారు. 5వేల లీటర్లతో ప్రారంభమైన డెయిరీని 70వేల లీటర్ల స్థాయికి పెంచారు. వ
- తిరుపతిలో ప్రధాన కూడళ్లను ఏర్పాటు చేసి మహనీయుల విగ్రహాలను ప్రతిష్టించారు. శ్రీకృష్ణదేవరాయలు, శంకరంబాడి, ఎంఎస్ సుబ్బలక్ష్మి విగ్రహాల స్థాపనకు శ్రీకారం చుట్టారు.తిరుపతి ముఖద్వారంలో పూర్ణకుంభం ఏర్పాటు చేశారు. అలాగే తెలుగుతల్లి విగ్రహం నెలకొల్పారు.
- టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ వేదిక్ యూనివర్సిటీ సైతం ఆయన హయాంలోనే ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అందులో దేశ, విదేశాలకు చెందిన 2వేల మంది విద్యార్థులు వేద విద్యను అభ్యసిస్తున్నారు,
- జిల్లాలో పారిశ్రామిక ప్రగతికి శ్రీకారం చుట్టారు.

- సత్యవేడులో ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు, 9 ఉన్నత పాఠశాలలు, ఒక తమిళ మీడియం స్కూలు ఏర్పాటు చేశారు. ఉబ్బలమడుగు, భూపతేశ్వరకోన, రాళ్లవాగు నీటి ప్రాజెక్టులను చేపట్టారు. రూ.5.50 కోట్లతో భూపతేశ్వరకోన ప్రాజెక్టు, రూ.19 కోట్లతో ఉబ్బలమడుగు ప్రాజెక్టు నిర్మించారు. తెలుగుగంగ ప్రధాన కాలువ నుంచి చెరువులకు నీటిని నింపేందుకు రూ.100 కోట్లతో ఉపకాలువలు నిర్మించారు.

- తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ వైఎస్సార్ మానసపుత్రికగా నిలిచిపోయింది. 2004 సెప్టెంబర్ 30న వర్సిటీ ఏర్పాటుకు బీజం పడింది. అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి తిరుపతి వెటర్నరీ కళాశాల స్వర్ణోత్సవాలకు ముఖ్యతిథిగా హాజరయ్యారు. కళాశాలను యూనివర్సిటీగా మారుస్తామని హామీ ఇచ్చారు. 2005 జూలై 15న వర్సిటీ గుర్తింపునిచ్చారు. రూ.145 కోట్లు కేటాయించి అభివృద్ధికి బాటలు వేశారు. ప్రస్తుతం ఈ వర్సిటీ పరిధిలో 35 కళాశాలు ఉన్నాయి. 3వేల పైగా విద్యార్థులు చదువుతున్నారు. 305 మంది అధ్యాపకులు, 2,545 మంది బోధనేతర సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు.

అందులో భాగంగా 2006లో శ్రీసిటీ సెజ్‌కు అనుమతులు మంజూరు చేశారు. 2008లో 8 పరిశ్రమలకు శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం వందలాది పరిశ్రమలతో శ్రీసిటీ రాష్ట్రానికే తలమానికంగా నిలిచింది. సుమారు రూ.60వేలకు పైగా పెట్టుబడులతో 27 దేశాలకు చెందిన పరిశ్రమలు ఏర్పడ్డాయి.

- శ్రీశైలం ప్రాజెక్టు నుంచి మిగులు జలాలను తరలించి సాగు, తాగునీరు అందించేందుకు 2005లో గాలేరు-నగరి సుజల ప్రవంతి పథకానికి శ్రీకారం చుట్టారు. దాదాపు 70శాతం పనులు పూర్తి చేశారు.
- నగరి నియోజకవర్గంలో చేనేతల సంక్షేమానికి చర్యలు చేపట్టారు. రసాయన నీటిని శుభ్రపరిచే కామన్ ఈటీపీ ప్లాంటు ఏర్పాటుకు అనుమతులతోపాటు రూ. 14 కోట్లు మంజూరు చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే రోజా ప్లాంటును ప్రారంభించి వినియోగంలోకి తీసుకువచ్చారు.
- నగరిలో రూ.15 కోట్ల వ్యయంతో వంద పడకల ఆస్పత్రి మంజూరు చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు-నేడు కింద రూ.5కోట్లతో అభివృద్ధి చేశారు. రోజా చారిటబుల్ ట్రస్ట్ వారు అదనపు పడకలు, వైద్య పరికరాలు, ఇతర సామగ్రిని వితరణగా అందించారు.
- నగరి మున్సిపల్ పరిధి సత్రవాడ శివారులో రూ.36 కోట్లతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించారు. తదనంతర కాలంలో గాలేరు నగరి ప్రాజెక్టును సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు అనుసంధానం చేశారు. ప్రస్తుతం ఆ ట్యాంక్ ద్వారానే నగరి ప్రజల దాహార్తి తీరుతోంది.

- సోమశిల-స్వర్ణముఖి కాలువకు 2009లో శ్రీకారం చుట్టారు. వెంకటగిరి నియోజకవర్గంలో 20 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చారు. మరో 10 వేల ఎకరాల బీడు భూములను సాగులోకి తీసుకువచ్చారు. శ్రీకాళహస్తి, ఏర్పేడు మండలాల్లో 30 వేల ఎకరాల సాగు నీరు అందించేలా ప్రాజెక్టుకు లక్ష్యాలను నిర్దేశించారు.

- పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ప్రారంభించారు. 2004 నుంచి 2008 వరకు ఈ పథకం ద్వారా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 24 లక్షల మందికి అందింది.
- వ్యవసాయం దండగని చంద్రబాబు అంటే.. కాదు వ్యవసాయం పండగని వైఎస్సార్ నిరూపించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా సుమారు 6.40 లక్షల మంది రైతులకు ఉచిత విద్యుత్ అందించారు. ఆత్మహత్యలకు పాల్పడిన అన్నదాతలకు సంబంధించి వారి కుటుంబాలకు తక్షణం ఆర్థిక సాయం చేశారు.
- చంద్రబాబు హయాంలో మూతపడిన చెరుకు ఫ్యాక్టరీలకు రూ.50 కోట్లు కేటాయించి పునఃప్రారంభించారు. అయితే ఆయన మరణం తర్వాత అవి మళ్లీ మూతపడడం విధితమే.

- కుప్పం నియోజకవర్గంలో సైతం వైఎస్సార్ పలు అభివృద్ధి పనులు చేపట్టారు. పేదల సంక్షేమానికి కృషి చేశారు. అందులో భాగంగా రూ.69.03 కోట్ల విద్యుత్ బకాయిల మాఫీతో పాటు 23,144 మంది రైతులకు చెందిన రూ.60.24 కోట్ల బ్యాంకు రుణాలను రద్దు చేశారు. మరో 5వేల మందికి రూ.5వేల వంతున ప్రోత్సాహకాలను అందజేశారు. పాలారు ప్రాజెక్టు నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించి రూ.55 కోట్లు నిధులు కేటాయించారు. కుప్పం నియోజకవర్గంలో 36 వేల పైగా ఇళ్లను పేదలకు మంజూరు చేశారు. 26 వేల రేషన్, ఆర్యోగశ్రీ కార్డులు అందజేశారు. ద్రవిడ యూనివర్సిటీకి నిధుల కొరత లేకుండా చర్యలు చేపట్టారు. 14 కొత్త కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చారు. కుప్పంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అబకలదొడ్డి వద్ద ఐటీఐ ఏర్పాటు చేశారు. శాంతిపురం, రామకుప్పం, గుడుపల్లె, కుప్పంలో కస్తూర్బాగాంధీ పాఠశాలలను ప్రారంభించారు. నియోజకవర్గంలో 5 భారీ పరిశ్రమలు ఏర్పాటు చేశారు.

- ఉమ్మడి జిల్లాలో ఇందిరమ్మ, రాజీవ్‌గృహల్పా పేరుతో భారీగా పక్కా ఇళ్లు నిర్మించి పంపిణీ చేశారు. మూడు విడతలుగా 3.15 లక్షల మందికి గూడు కల్పించారు. శ్రీకాళహస్తి పట్టణంలో రాజీవ్‌నగర్ కాలనీ ఏర్పాటు చేసి 11వేల మందికి పక్కాగృహాలు నిర్మించి ఇచ్చారు.

రాజన్నా.. రచ్చబండే సాక్షి

చిత్తూరు అర్బన్: 'రచ్చబండ సాక్షిగా నిను మరువలేం రాజన్నా.. అంటూ అనుప్పల్లె గ్రామస్తులతోపాటు ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రజలు నేటికీ కన్నీళ్లు పెడుతూనే ఉన్నారు. నీ జ్ఞాపకాలు తలుచుకుని.. తీపి గురుతులు నెమరువు వేసుకుని ఆవేదనకు లోనవుతూనే ఉన్నారు. 2009, సెప్టెంబరు 2న సీఎం స్థాయి వ్యక్తి నేరుగా ప్రజలను కలిసి, వ్యక్తిగత-మౌలిక అవసరాలు గుర్తించి తెలుసుకుని.. వాటి పరిష్కరించే వినూత్న కార్యక్రమానికి నడుంబిగించారు. చిత్తూరులో చేపట్టిన ఈ పైలెట్ ప్రాజెక్టు విజయవంతమైతే .. రాష్ట్ర మొత్తం అమలు చేయాలని రాజశేఖర రెడ్డి ఆలోచన. ముఖ్యమంత్రి హోదాలో రచ్చబండకు వస్తున్న వైఎస్.రాజశేఖర రెడ్డికి స్వాగతం పలికేందుకు కట్టమంచిలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ అందరూ నిరీక్షిస్తున్నారు. సమయం ఉదయం 9.30 గంటలైనా చాపర్ చేరుకోలేదు. పదయినా ఆచూకీ రాలేదు. సమయం దాటుతున్న కొద్దీ సామాన్యుల నుంచి అధికారులు, ప్రజాప్రతినిధుల్లో ఆందోళన మొదలైంది. రాజన్న అచూకీ లేదనే విషయం ఆలస్యంగా గుర్తించారు. ప్రత్యేకించి ఆ రోజు అనుప్పల్లె గ్రామమంతా వైఎస్సార్ గురించి ఏదైనా తెలుస్తుందేమోనని టీవీలకు అతుక్కుపోయారు. తీరా మరుసటి రోజున చాపర్ పావురాలగుట్ట వద్ద ప్రమాదానికి గురై రాజన్న కన్నుమూశారన్న విషాద వార్తను వినాల్సి వచ్చింది. రాజన్న కూర్చుంటారని ఆశించి భంగపడ్డ రచ్చబండ మాత్రం నాటి నుంచి మూగబోయింది. ఊరు ఊరంతా ఆ మహనీయుడి కోసం కన్నీళ్లు పెట్టుకుంది. అనుప్పల్లె రావిచెట్టు కిందున్న రచ్చబండ వైఎస్సార్‌ను స్పర్శించకుండా బండరాయిగానే మిగిలిపోయింది. రాజన్న వర్ధంతికి గ్రామస్తులు రచ్చబండ వద్దకు చేరి కుమిలిపోవడం రివాజుగా మారుతోంది.



రాజన్న రాకకోసం చిత్తూరు అనుప్పల్లెలో ఏర్పాటు చేసిన రచ్చబండ (ఫైల్)

అర్జీ ఆవేదన

'సమస్యలతో చచ్చి బతుకుతున్నా.. ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. పాలకులూ కన్నెత్తి చూడడం లేదు. ఉన్నతాధికారులుకైనా గోడు విన్నవిస్తే పరిష్కారమవుతుందనే చిన్న ఆశతో.. సచ్చుబడిన కాళ్లను ఒడిసిపట్టుకుని.. కడుపు మాడ్చుకుని కుటుంబీకుల సహాయంతో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాం. చెప్పులరిగేలా చక్కెర్లు కొడుతున్నాం. అర్జీలిచ్చి గోడు వెళ్లబోసుకుంటున్నాం. వారం వారం తిరిగి..తిరిగి అలసిపోతున్నాం. పెద్ద మనసుతో ఆలోచించి సమస్యలు పరిష్కరించాలని అధికారుల కాళ్లు పట్టుకుంటున్నాం. కానీ ఏం లాభం..? ఏ ఒక్కరూ కనికరించడం లేదు. సమస్యలు పరిష్కరించి న్యాయం చేయడం లేదు' అంటూ జిల్లాలోని పలువురు బాధితులు ఆవేదన చెందుతున్నారు. మూడు నాలుగు సార్లు అర్జీలిస్తున్నా పట్టించుకునే నాథుడే లేరని కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. కూటమి పాలనలో అర్జీదారుల ఆవేదనపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

- పరిష్కారం కాని సమస్యలు
- పేరుకుపోతున్న అర్జీలు
- పట్టించుకోని క్షేత్ర స్థాయి అధికారులు
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న ప్రజలు
- చోద్యం చూస్తున్న కూటమి నేతలు



అర్జీదారులతో కిక్కిరిసిపోతున్న కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ భవనం

గ్రౌండ్ రిపోర్ట్

చిత్తూరు కలెక్టరేట్ : అర్జీదారులు అలసిపోతున్నారు. సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఏదో ఒక వారం అధికారులు కనికరించకపోతారా.. అన్న భావనతో నెలల తరబడి తిరుగుతూనే ఉన్నారు. కానీ వీరి సమస్యలను ఆలకించి పరిష్కరించాల్సిన అధికారులు పట్టించుకోకపోగా.. పాలకులు వాటి గురించి అసలు ఆలోచించకపోవడంతో ముప్పతిప్పలు ఎదుర్కొంటున్నారు.

ఏమార్చి.. మోసం చేసి!

క్షేత్ర స్థాయిలో అర్జీదారుల సమస్యలు పరిష్కరించకుండానే ఏమార్చి సంతకాలు చేయించుకుని పరిష్కరించినట్లుగా మోసం చేస్తున్నారు. అర్జీదారులు తిరిగి మళ్లీ ప్రజాసమస్యల పరిష్కార వేదికకు విచ్చేసి అర్జీలందజేస్తున్నారు. కలెక్టర్ దగ్గరకు వెళ్లినా సమస్య నేనే పరిష్కరించాలి అంటూ జిల్లాలోని కొందరు తహసీల్దార్లు అర్జీదారులను భయాందోళనలకు గురిచేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అర్జీదారులు చేసేది లేక మిన్నకుండిపోతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు వేల అర్జీలు బుట్టదాఖలయ్యాయి.

జిల్లా సమాచారం

జూన్ 2024 నుంచి సెప్టెంబర్ 1, 2005 వరకు నమోదైన అర్జీల సంఖ్య	61,100
అధికారులు చెబుతున్న కాకిలెక్కలు	54,128
ప్రతివారం పీజీఆర్ఎస్‌లో నమోదు అవుతున్న అర్జీలు	250 నుంచి 310 వరకు
ప్రతివారం రెవెన్యూ సమస్యలు	180 నుంచి 250 వరకు

అంతా కాకిలెక్కలే

జిల్లాలో 2024 జూన్ 15 నుంచి 2025 సెప్టెంబర్ 1వ తేదీ వరకు నిర్వహించిన పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) అధికారిక నివేదికల ప్రకారం 61,100 అర్జీలు నమోదయ్యాయి. ఇందులో 54,128 అర్జీలు పరిష్కరించినట్లు అధికారులు కాకిలెక్కలు చెబుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో కనీసం 30 శాతం అర్జీదారులు కూడా కాని పరిస్థితి. ఉన్నతాధికారుల ఒత్తిడిని అధిగమించేందుకు సమస్యలు పరిష్కరించినట్లుగా బోగస్ నివేదికలు సమర్పించి చేతులు దులుపుకుంటున్నారు. పేద ప్రజల పట్ల కాస్త కూడా కనికరం చూపకుండా జిల్లాలోని క్షేత్రస్థాయి అధికారులు మోసం చేస్తున్నారు. దీంతో అర్జీదారులు కాళ్లు అరిగేలా తిరుగుతూనే ఉన్నారు.

దివ్యాంగ పింఛన్‌కు పది సార్లు అర్జీ ఇచ్చా



నడవలేని స్థితిలో జూన్ 16వ తేదీన కలెక్టరేట్‌కు విచ్చేసిన దివ్యాంగుడు నాగం

పలమనేరుకు చెందిన దివ్యాంగుడు నాగం పింఛన్ ఇవ్వడం లేదని ఇప్పటికి పది సార్లు అర్జీలు సమర్పించారు. అయితే ఇప్పటికీ ఆ దివ్యాంగునికి పింఛన్ మంజూరు చేయలేదు.

సమస్య ఇదీ!

100 శాతం అంగవైకల్యం ఉన్న నాగం నడవలేని దీనస్థితిలో అధికారుల వద్దకు వచ్చి అర్జీలు అందజేశారు. అయినా కనికరం లేదు. ఇచ్చిన ప్రతి అర్జీకి ఏదో ఒకటి చెప్పి సంతకం చేయించుకుంటున్నారే తప్ప పింఛన్ మాత్రం మంజూరు చేయడం లేదని ఆ దివ్యాంగుడు బోరున విలపిస్తున్నాడు.

మూడు సార్లు అర్జీలిచ్చినా..!

చిత్తూరు నియోజకవర్గం, గుడిపాల మండలం, చామంతిపురం గ్రామస్తులు రోడ్డు మార్గం లేక అవస్థలు పడుతున్నారు. పీజీఆర్ఎస్‌లో జూన్ 2న కలెక్టరేట్‌లో అర్జీ అందజేశారు. ఆ తర్వాత మరో రెండు సార్లు మండల స్థాయి అధికారులకు అర్జీ సమర్పించారు.

సమస్య ఇదీ!

కమ్మతిమ్మపల్లి నుంచి చామంతిపురానికి రెండున్నర కిలోమీటర్ల దూరం ఉంటుంది. అందులో ఒక కిలోమీటర్ వరకే తారు రోడ్డు ఉండగా మిగిలిన ఒకటిన్నర కిలో మీటర్‌కు రోడ్డు సౌకర్యం లేదు. ఆ గ్రామానికి బస్సు సౌకర్యం కూడా లేదు. విద్యార్థులు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అర్జీలిచ్చినా ఇప్పటికీ న్యాయం జరగని పరిస్థితి.



రోడ్డు సమస్య పరిష్కారానికి జూన్ 2వ తేదీన కలెక్టరేట్‌లో అర్జీ ఇచ్చేందుకు వచ్చిన చామంతిపురం గ్రామస్తులు

దారిలేక అవస్థలు

గుడిపాల మండలం, ఒంటిల్లు గ్రామస్తులు తమ గ్రామానికి రోడ్డు మార్గం వేయించాలంటూ పీజీఆర్ఎస్‌లో ఇప్పటికి నాలుగు సార్లు అర్జీలు అందజేశారు. గత జూన్ 9 నుంచి వరుసగా ప్రతివారం పీజీఆర్ఎస్‌లో అర్జీలు సమర్పిస్తున్నారు. అయినా ఇంతవరకు సమస్య పరిష్కారానికి నోచుకోలేదు.

సమస్య ఇలా!

ఒంటిల్లు గ్రామం వద్ద బెంగళూరు-చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే మార్గం వెళ్తోంది. విలేజ్ టర్న్ యాక్టివిటీ రోడ్డు ఆ హైవే వల్ల కనుమరుగయ్యింది. అప్పటి నుంచి ఆ గ్రామస్తులు తమ గ్రామానికి వెళ్లాలంటే నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. హైవేకి సర్వే చేసే సమయంలో దారి చూపించి, రోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు రోడ్డు వేయించలేదు. అనేక సార్లు అధికారులకు అర్జీ ఇచ్చినా ఎటువంటి లాభం లేదని ఆ గ్రామస్తులు వాపోతున్నారు.



జూన్ 9న పీజీఆర్ఎస్‌లో అర్జీ అందజేసి సమస్యను ఏకరువు పెడుతున్న ఒంటిల్లు గ్రామస్తులు

న్యాయం శూన్యం

ఇప్పటికి మూడు సార్లు అర్జీలు అందజేసినా పుంగనూరు మండలం, మేలందొడ్డి పంచాయతీ, గోపిశెట్టి గ్రామానికి చెందిన గ్రామస్తులకు న్యాయం జరగని దుస్థితి. నివసిస్తున్న ఇళ్లను తొలగిస్తామని చెబుతున్నారని, న్యాయం చేయాలని ఆ గ్రామస్తులు జూలై 4వ తేదీన పీజీఆర్ఎస్‌లో అర్జీ అందజేశారు. ఆ తర్వాత మరో రెండు సార్లు మండల స్థాయి అధికారులకు అర్జీ ఇచ్చారు.

సమస్య ఇదీ!

మేలందొడ్డి పంచాయతీ, గోపిశెట్టిపల్లిలో సర్వే నం.164/3లో 62 సెంట్లలో శ్రీమాణిక్యవరదరాజస్వామి ఆలయ భూములు న్నాయి. ఆ భూమి ఉన్న ప్రాంతంలో గోపిశెట్టి గ్రామం ఉంది. దాదాపు వందేళ్ల నుంచే ఆ గ్రామంలో ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లల్లోనే స్థానికులు నివాసముంటున్నారు. ప్రస్తుతం అధికారులు ఇళ్లను తొలగిస్తామని భయాందోళనకు గురిచేస్తున్నారు. ఈ సమస్యపై న్యాయం చేయాలని కోరినా ఇంతవరకు స్పందించని పరిస్థితి.



న్యాయం కోసం జూలై 7న పీజీఆర్ఎస్‌లో అర్జీ అందజేసిన గోపిశెట్టి గ్రామస్తులు


తెలుగు సృజనకి ప్రతిరూపం వైఎస్సార్



వైఎస్సార్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న భారతీయ తెలుగు రచయితల సమాఖ్య సభ్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): తెలుగువారి సృజనకి ప్రతిరూపంగా దివంగత ముఖ్యమంత్రి డా వైఎస్.రాజశేఖరరెడ్డి నిలిచారని భారతీయ తెలుగు రచయితల సమాఖ్య చిత్తూరు జిల్లా శాఖ అధ్యక్షుడు తోట గోవిందన్ కొనియాడారు. మహానేత వర్ధంతిని పురస్కరించుకుని చిత్తూరు నగరంలోని సమాఖ్య కార్యాలయంలో సోమవారం సమాఖ్య జాతీయ గౌరవాధ్యక్షుడు మత్రిపూడి దేవేంద్రరావు నేతృత్వంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గోవిందన్ మాట్లాడుతూ తెలుగు భాష, సాహిత్యాల వ్యాప్తికి తెలుగు రాష్ట్ర ప్రభుత్వాల విధానాలే అడ్డంకిగా ఉన్నాయన్నారు. తెలుగు భాషకు ప్రాచీన హోదా కల్పించిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందని, ప్రస్తుత పాలకులు ఆయన్ను ఆదర్శవంతగా తీసుకోవాలని సూచించారు. తెలుగు భాషాభిమానులు కోరుశ్వర మొదలియార్, రాజేంద్రన్, మురళి, ఖాదరు బాషా, నాగరాజు, రఫీ, సునీల్, షఫీ ఉల్లా పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా రథ కలశ ప్రతిష్ట



కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధివినాయక స్వామి రథానికి సోమవారం శాస్త్రోక్తంగా కలశ ప్రతిష్ట చేశారు. తొలుత ప్రధాన ఆలయంలో రథ కలశం, గొడుగుకు, బ్రహ్మ విగ్రహానికి సంప్రోక్షణ పూజలు చేశారు. కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం రథానికి ప్రత్యేక పూజలు చేసి కలశాన్ని ప్రతిష్టించారు. బుధవారం జరగబోయే రథోత్సవానికి ముందు ఇలా ప్రతిష్ట పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోందని ఈవో పెంచలకిషోర్ తెలిపారు.

క్లుప్తంగా

ఉరేసుకుని బలవన్మరణం


మృతి చెందిన బాలాజీ

గంగవరం: ఓ వ్యక్తి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కొత్తపల్లి పంచాయతీ, బొమ్మనపల్లి గ్రామానికి చెందిన బాలాజీ(43) వృత్తిరీత్యా డ్రైవర్. సాయినగర్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు నడుపుతున్నాడు. గత ఆదివారం భూ తగాదాల విషయమై చిన్నాన్న కుటుంబీకులతో ఘర్షణ పడ్డాడు. అతని చిన్నమ్మ గంగవరం పోలీస్ స్టేషన్‌లో ఈ విషయమై ఫిర్యాదు చేసింది. అయితే సోమవారం వేకువజామున ఊరు అనుకుని పశువుల షెడ్‌లో పాలు పింతికేందుకు వెళ్లాడు. కొద్దిసేపటికే బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబీకులు గమనించి బాలాజీని పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే బాలాజీ మృతి చెందినట్టు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే భూ తగాదాల విషయమై స్టేషన్‌లో ఫిర్యాదు అందడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడా..? లేక మరేవైనా కారణాలు ఉన్నాయా..? అనే కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు. దర్యాప్తులో తేలాల్సి ఉంది.

వృద్ధుడి అదృశ్యం

పుంగనూరు: కుమార్తె ఇంటికి వస్తూ ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన మండలంలోని చెర్లోపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. అన్నమయ్య జిల్లా, మదనపల్లె మండలం, నిరుగట్టువారిపల్లెకి చెందిన రెడ్డెప్ప(61) తన కుమార్తె నిర్మలను చూసేందుకు ఆదివారం సాయంత్రం పుంగనూరు మండలం, చెర్లోపల్లి గ్రామానికి బయలుదేరాడు. తండ్రి ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బ్రహ్మోత్సవం.. లంబోదరుడి వైభవం!


చిలుక వాహనంలో విఘ్నేశ్వరుడు

- అంగరంగ వైభవంగా వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలు
- చిలుక , వృషభ వాహనాలపై చిద్విలాసం
- తరలివచ్చిన భక్తజనం
- నేడు గజ వాహన సేవ

కాణిపాకం: కాణిపాక వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. అభిషేకంతో పాటు నిత్యపూజలు కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం చిలుక, వృషభ వాహనాలపై స్వామి వారు ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు. ఉదయం మూలస్థానంలోని స్వామివారికి విశేష అభిషేక పూజలు, అలంకరణలు చేశారు. అలంకార మండపంలో శ్రీసిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవ మూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించారు. మంగళ హారతులతో చిలుక వాహనంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. రాత్రి వృషభ వాహనంపై ఊరేగుతూ స్వామి వారు అభయమిచ్చారు. అంతకుముందు ఉభయదారులు ఊరేగింపుగా వచ్చి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కాగా మంగళవారం జగవాహన సేవలో స్వామివారు తరిస్తారని ఈఓ పెంచలకిషోర్ తెలిపారు. ఈ వాహన సేవకు కాణిపాకం వన్నియ నాయకర్ వంశస్తులు ఉభయదారులుగా వ్యవ హరిస్తారని ఆయన పేర్కొన్నారు.

వృషభ వాహనంపై విఘ్నేశ్వరుడు


సమస్యలు పరిష్కరించండయ్యా!


న్యాయం చేయాలని కోరుతున్న గంగుపల్లి గ్రామస్తులు


శ్మశాన దారి సమస్య పరిష్కరించాలని కోరుతున్న పంత్రాంపల్లి గ్రామస్తులు

- కలెక్టరేట్‌కు క్యూ కట్టిన అర్జీదారులు
- వివిధ సమస్యలపై 297 అర్జీల సమర్పణ

చిత్తూరు కలెక్టరేట్ : 'అయ్యా.. తిరుగుతూనే ఉన్నాం .. సమస్యలు పరిష్కరించండి' అంటూ వివిధ ప్రాంతాల అర్జీదారులు ఉన్నతాధికారులను వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి క్యూ కట్టారు. కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ అర్జీలు స్వీకరించారు. అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలపై 297 అర్జీలు నమోదైనట్లు కలెక్టరేట్ ఏవో వాసుదేవన్ వెల్లడించారు. ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడేల్, డీఆర్‌వో మోహన్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, కుసుమకుమారి పాల్గొన్నారు.

పశువైద్య సేవలు అందడం లేదు

తమ గ్రామంలో పశువైద్య సేవలు సరిగా అందడం లేదంటూ పెనుమూరు మండలం గంగుపల్లికి చెందిన తులసీరాం, గీత వాపోయారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ తమ గ్రామంలోని పశుసంవర్థక సహాయకులు సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. జబ్బుపడిన మూగజీవాలకు వైద్యం చేయకపోవడంతో మృతిచెందుతున్నాయన్నారు.

శ్మశాన దారిని బాగు చేయించండి

శ్మశాన వాటిక దారి సమస్య పరిష్కరించడయ్యా అంటూ చిత్తూరు మండలం పంత్రాంపల్లి గ్రామస్తులు త్యాగరాజరెడ్డి, భాగ్యవతి అధికారులను వేడుకున్నారు. తమ గ్రామంలోని శ్మశానవాటికకు వెళ్లే దారి గుంతలమయం కావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు వాపోయారు. అంతిమ సంస్కారాలు చేసేందుకు వెళ్లే సమయంలో సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. దారిని శుభ్రం చేయించి రోడ్డు వేయించాలని కోరారు.

ఆక్రమించుకున్నారు


న్యాయం చేయాలంటున్న బాధితుడు సుబ్రహ్మణ్యం

తన భూ సమస్య కోర్టులో జరుగుతుండగా కొందరు ఆక్రమించుకున్నారని పెనుమూరు మండలం, కలిగిరికి చెందిన సుబ్రహ్మణ్యం వాపోయారు. తమ గ్రామ పరిధిలో సర్వే నం.10/1లోని భూ సమస్య కోర్టులో కొనసాగుతోందన్నారు. ఇంతలోపు తన భూమిని ఆక్రమించుకుని భయాందోళనలు సృష్టిస్తున్నారని తెలిపారు. కోర్టు తీర్పు వచ్చే వరకు తన భూమి దురాక్రమణకు గురికాకుండా న్యాయం చేయాలని అధికారులను కోరారు.

వైకల్య పరీక్షలు చేయమంటున్నారు


కలెక్టరేట్‌కు విచ్చేసిన బాధితుడు శివకుమార్

వైద్యాధికారులు వైకల్యం పున:పరిశీలన పరీక్షలు చేయమని ఇబ్బందులు పెడుతున్నారని చిత్తూరు రూరల్ మండలం, దిగువమాసాపల్లికి చెందిన అపర్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు దివ్యాంగుడైన తన కుమారుడు శివ కుమార్‌తో కలిసి పీజీ ఆర్‌ఎస్‌లో అర్జీ అందజేశారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ తన కుమారుడు శివకుమార్ నడవలేడని, మాట్లాడలేడని వాపోయారు. 100 శాతం అంగవైకల్యం ఉన్నప్పటికీ పింఛన్ తొలగించారని కన్నీరు మున్నీరయ్యారు. వైద్యపరీక్షలు పున:పరిశీలన చేయించుకోవాలని నోటీసు ఇచ్చారన్నారు. అక్కడకి వెళ్తే వైద్యాధికారులు పరీక్షలు చేసేందుకు కుదరదని ఇబ్బందులు పెడుతున్నారన్నారు. పరిశీలించి తన కుమారుడికి తొలగించిన రూ.15 వేల పింఛన్ ఇప్పించాలని కోరారు.

తాగేసి.. విగ్రహాన్ని కూల్చేసి!


యువకుడు కూల్చి వేసిన వినాయకుని విగ్రహం

బంగారుపాళెం: మద్యం మత్తులో ఓ మందుబాబు వినాయక విగ్రహాన్ని కూల్చివేశాడు. అడ్డుకోబోయిన ఆలయ పూజారిపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై గ్రామస్తులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలయ ధర్మకర్త నాగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కోలావారిఇండ్లు, యానాది కాలనీలో 2012లో వినాయకస్వామి ఆలయాన్ని నిర్మించి విగ్రహ ప్రతిష్ట చేశారు. అప్పటి నుంచి కాలనీ ప్రజలు ఆలయం వద్ద పూజలు, భజనలు చేసుకుంటున్నారు. ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన నవీన్‌కుమార్ మద్యం మత్తులో ఆలయంలోకి ప్రవేశించాడు. వినాయకుని విగ్రహాన్ని కాలితో తన్నడంతో అక్కడే ఉన్న పూజారి నారాయణ అడ్డుకున్నారు. అతని చేయి కొరికి గాయపరచి విగ్రహాన్ని కూల్చివేసి పరారయ్యాడు. ఈ మేరకు గ్రామస్తులు, ఆలయ ధర్మకర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాలికపై బాబాయి లైంగిక వేధింపులు

కేసు నమోదు

చిత్తూరు అర్బన్: వరసకు బాబాయ్ అయ్యే వ్యక్తి.. ఓ మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. దీనిపై చిత్తూరు టూ టౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ నెట్టికంటయ్య వివరాల మేరకు... నగరానికి చెందిన 13 ఏళ్ల బాలికను షికారు తీసుకెళ్తామని చెప్పి వరుసకు బాబాయ్ అయిన వ్యక్తి బయట ఊర్లకు తీసుకెళ్లాడు. ఈ నేపథ్యంలో బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డట్టు కుటుంబ సభ్యులు గుర్తించారు. ఇటీవల జరిగిన విషయాన్ని బాలిక కుటుంబ సభ్యులకు తెలియజేసింది. ఆ బాధిత బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నవాజ్ అనే వ్యక్తి పై పోక్సో, కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పింఛన్ల కోసం నిరీక్షణ


గుడిపాల: పింఛన్ల కోసం నిరీక్షిస్తున్న వృద్ధులు

గుడిపాల: మండలంలో సర్వర్ సరిగ్గా పనిచేయకపోవడంతో పింఛన్ల కోసం నిరీక్షించాల్సి వచ్చింది. సోమవారం ఉదయం కొంతసేపు పింఛన్ల పంపిణీ జరగ్గా ఉన్నట్టుండి సర్వర్ పనిచేయకుండా పోయింది. సుమారు 2గంటల పాటు పనిచేయలేదు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు ఇబ్బందులు పడ్డారు. కొంతమంది పనులకు వెళ్లలేక ఇంటి వద్దే నిలిచిపోయారు. అనంతరం సర్వర్ పనిచేశాక పింఛన్ల పంపిణీ మొదలైంది.

'బార్'లా తెరిచేశారు!

- మద్యం బార్లల్లో కొత్త సమయ పాలన
- అర్ధరాత్రి వరకు అందుబాటులో మద్యం
- ఫలించిన సిండికేట్ రీ–నోటిఫికేషన్ ప్లాన్
- వచ్చే వారం మిగిలిన బార్లకు దరఖాస్తులు?

చిత్తూరు అర్బన్: 'బార్'లా తెరిచేశారు. కొత్త మద్యం బార్ పాలసీ సోమవారం నుంచి జిల్లాలో అమల్లోకి వచ్చింది. ఉదయం నుంచి అర్ధరాత్రుల వరకు ఎప్పుడు కావాలంటే అప్పుడు మద్యం అందుబాటులో ఉంచే కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

ఆశలన్నీ రీ–నోటిఫికేషన్‌పైనే?

జిల్లాలో 11 మద్యం బార్లకు గతనెల నోటిఫికేషన్ ఇవ్వగా.. ఇందులో చిత్తూరులో 7, కుప్పం, నగరి, పుంగనూరు, పలమనేరు మునిసిపాలిటీల్లో ఒక్కో మద్యం బారు ఏర్పాటు చేయాలని నోటిఫై చేశారు. కుప్పం, పుంగనూరుతో పాటు చిత్తూరులో మూడు బార్లకు దరఖాస్తులు రావడంతో లైసెన్సులు కేటాయించారు. పలమనేరు, చిత్తూరులోని మరో నాలుగు బార్లకు దరఖాస్తులు రాకపోవడంతో వీటికి మళ్లీ రీ–నోటిఫికేషన్ ఇచ్చే అవకాశాలున్నాయి. ఇక నగరిలోని బార్‌కు ఒక దరఖాస్తు మాత్రమే రావడంతో, ఈనెల 4వ తేదీ సాయంత్రం లోపు మరో మూడు దరఖాస్తులు వస్తే ఇక్కడ లైసెన్సు జారీచేస్తారు. లేనిపక్షంలో నగరితో పాటు జిల్లాలోని ఆరు బార్లకు మళ్లీ రీ–నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. వాస్తవానికి చిత్తూరు నగరంలో మెజారిటీ మద్యం బార్లు కూటమి నేతల చేతుల్లోనే ఉండేవి. తాజాగా ప్రభుత్వం సూచించిన నిబంధనలు నచ్చని బార్ నిర్వాహకులు సిండికేట్‌గా ఏర్పడ్డట్టు తెలుస్తోంది. అందరూ మాట్లాడుకుని నాలుగు బార్లకు దరఖాస్తులు వేయలేదని సమాచారం. వచ్చే వారం ఇవ్వనున్న రీ–నోటిఫికేషన్‌లో ఆర్థికభారం తగ్గేలా ప్రభుత్వం ఏదైనా నిర్ణయం తీసుకుంటుందా..? అంటూ ఆత్రుతతో ఎదురుచూస్తున్నారు.

అర్ధ రాత్రి 12 వరకు మద్యం

ఉదయం 10 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం బార్లు అందుబాటులో ఉంటాయి. ఈ లెక్కన మద్యం దుకాణాలు మూసేసిన రెండు గంటల తరువాత కూడా బార్లల్లో మద్యం అందుబాటులో ఉంటుంది

జాలి చూపించారు!


పింఛన్ సొమ్ము అందుకున్న హర్షద్

సాక్షి ఎఫెక్ట్..

బంగారుపాళ్యం/కాణిపాకం: పుట్టకతోనే పక్షవాతానికి గురైన ఓ యువకుడికి అడ్డగోలుగా పింఛన్ తొలగించారు. దీనిపై 'సాక్షి'లో వరుస కథనాలు వచ్చాయి. గత నెల 17వ తేదీన 'నన్ను చూస్తే జాలి లేదా?' శీర్షికన వార్త వెలువడింది. దీనిపై అధికారులు స్పందించారు. ఎట్టకేలకు పింఛన్‌ను పునరుద్ధరించారు. వివరాలు.. బంగారుపాళ్యం మండల కేంద్రానికి చెందిన సమ్మద్, సాహిన్ దంపతుల పెద్ద కుమారుడు హర్షద్ పుట్టుకతోనే పక్షవాతానికి గురయ్యాడు. అతన్ని రక్షించేందుకు తల్లిదండ్రులు ఉన్నదంతా ధారబోశారు. అయినా కొడుకు కోలుకోలేదు. ఇన్నాళ్లు ప్రభుత్వం ఇచ్చే పింఛన్‌తోనే నెట్టుకొస్తున్నారు. అయితే ఇటీవల రీ వెరిఫికేషన్ పేరుతో ఆ యువకుడిని పింఛన్‌కు అనర్హుడిగా తేల్చారు. ఈ మేరకు సచివాలయ సిబ్బంది నోటీసులు కూడా జారీచేశారు. దీనిపై 'సాక్షి'లో వరుస కథనాలు వచ్చాయి. స్పందించిన అధికారులు విచారణకు ఆదేశించారు. పునః పరిశీలన చేసి ఆ యువకుడికి పింఛన్ వచ్చేలా చేశారు. మూడు రోజుల క్రితం సీఎంఓ ఆఫీసు నుంచి ఫోన్ చేసి మళ్లీ మీకు రూ.15వేల పింఛన్ వచ్చేలా చేశామని వివరించారు. ఈ క్రమంలోనే సోమవారం పింఛన్ సొమ్మును అందుకుని బాధిత తల్లిదండ్రులు 'సాక్షి'కి ఫోన్ చేసి కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తుల పరిశీలనకు 88 మంది హాజరు

చౌడేపల్లి: బోయకొండ గంగమ్మ ఆలయ పరిపాలన కార్యాలయంలో నూతన పాలక మండలి సభ్యుల పదవుల కోసం దరఖాస్తు చేసుకొన్న వారిలో 88 మంది సభ్యులు దరఖాస్తుల పరిశీలనకు హాజరైనట్లు ఈఓ ఏకాంబరం తెలిపారు. మొత్తం 115 మంది సభ్యులు దరఖాస్తు చేసుకోగా వారిలో 27 మంది గైర్హాజరయ్యారు. మంగళవారం సైతం దరఖాస్తుదారులు కార్యాలయంలో సంప్రదిస్తే పరిశీలించి నివేదికలకు కమిషనర్ కార్యాలయానికి పంపుతామని ఈఓ పేర్కొన్నారు.

హామీలు అమలు చేయాలి



పెన్షన్ మార్చ్ లో పాల్గొన్న సమీర్

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వం సీపీఎస్ ఉద్యోగులకు న్యాయం చేయాలని ఏపీసీపీఎస్ ఈఏ ఉద్యోగుల సంఘం నాయకులు సమీర్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విజయవాడలో నిర్వహించిన పెన్షన్ మార్చ్‌లో పాల్గొన్నట్టు వెల్లడించారు. సెప్టెంబర్ 1 సీపీఎస్ ఉద్యోగులకు చీకటి రోజు అని గుర్తుచేశారు. సీపీఎస్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి ఓపెన్ చెస్ టోర్నీ


రాష్ట్ర స్థాయి చెస్ టోర్నీలో పాల్గొన్న వివిధ జిల్లాల చెస్ క్రీడాకారులు


చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని కొంగారెడ్డిపల్లి వద్ద ఉన్న ఓ ప్రైవేట్ హాల్‌లో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఓపెన్ చెస్ టోర్నీ హోరాహోరీగా సాగుతోంది. ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 350 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. యువన్య బ్రెయిన్ బాక్స్ చెస్ అకాడమీ, ఆంధ్రా చెస్ అసోసియేషన్‌లు సంయుక్తంగా రాష్ట్ర స్థాయి చెస్ టోర్నీ నిర్వహించాయి. ఈ టోర్నీలో భవన్ (ఎన్టీఆర్ జిల్లా), రాజు (ప్రకాశం), హర్షప్ (తిరుపతి) విద్యార్థులు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవశం చేసుకున్నారు. టోర్నీలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. ఏపీ చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఆర్‌బీ ప్రసాద్, జిల్లా చైర్మన్ బాబుప్రసాద్‌రెడ్డి, టోర్నీ డైరెక్టర్ యువన్య, జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారి రాఘవులు, న్యాయవాది కృష్ణకిషోర్, సభ్యులు వెంకటేష్, బాలు, లేఖ్య, పిళ్లై దినేష్, సురేఖ పాల్గొన్నారు.

వరసిద్ధునికి పట్టువస్త్రాల సమర్పణ


పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యేలు

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామికి సోమవారం శ్రీకాళహస్తీశ్వరుని తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్‌రెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, ఈఓ బాపిరెడ్డి ఊరేగింపుగా స్వామికి పట్టువస్త్రాలు అందించారు. కాణిపాకం ఈఓ పెంచల కిషోర్ పాల్గొన్నారు.

పింఛను సొమ్ముతో ఉడాయించిన పంచాయతీ కార్యదర్శి


పింఛను డబ్బుతో పరారైన పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు

పుంగనూరు: సామాజిక పింఛను డబ్బులు తీసుకుని ఓ ఉద్యోగి పారిపోయాడు. పుంగనూరు మండలంలో బండ్లపల్లెకి చెందిన పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు రెండు రోజుల క్రితం పింఛనుదారులకు పంపిణీ చేసేందుకు బ్యాంక్ నుంచి రూ.6.34 లక్షలు డ్రా చేశాడు. సోమవారం సాయంత్రం వరకు బండ్లపల్లిలో పెన్షన్ పంపిణీ చేయలేదు. అధికారులకు లబ్ధిదారులు ఫిర్యాదు చేయడంతో విచారణ చేసి... పింఛను డబ్బులతో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు పారిపోయినట్లు నిర్ధారించారు. అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీవో లీలామాధవి తెలిపారు. కాగా, బెట్టింగ్‌లకు అలవాటుపడిన శ్రీనివాసులు పింఛను డబ్బుతో ఉడాయించినట్లు ప్రచారం జరుగుతోంది.

ప్రతి ఫిర్యాదుపై విచారణ చేపట్టాలి


సమస్యలు వింటున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజలు ఇచ్చే ప్రతి ఒక్క ఫిర్యాదుపైనా ఆయా పోలీస్ స్టేషన్ల హౌజ్ ఆఫీసర్లు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని చిత్తూరు ఎస్పీ మణికంఠ ఆదేశించారు. చిత్తూరు నగరంలోని ఏఆర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుంచి వినతులు తీసుకున్నారు. మొత్తం 32 వినతులు అందాయి. వీటిలో కుటుంబ తగాదాలు, వేధింపులు, మోసాలు, ఇంటి తగాదాలు, భూ తగాదాలు, ఆర్థిక లావాదేవీలు, బెదిరింపులకు సంబంధించిన సమస్యలున్నాయి. ప్రతీ ఫిర్యాదును ఆన్‌లైన్ చేయడంతో పాటు నిర్ణీత గడువులోపు సమస్య పరిష్కారమయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే చిత్తూరు ఏఎస్పీ రాజశేఖర రాజు, డీటీసీ డీఎస్పీ రాంబాబు సైతం ప్రజల నుంచి ఫిర్యాదులను తీసుకున్నారు.